# "వికల్ప సంగమం"

## ప్రత్యామ్నాయ దృక్పథాల జాతీయ సమాగమానికై ఓ ప్రతిపాదన

(ప్రథమ సమాగమం, టింబక్టు - 17 నుండి 19 అక్టోబర్ కోసం ఒక చిరుపత్రం)

ప్రస్తుతం మనం అవలంబిస్తున్న విధానాలకు ఆలంబనగా నిలిచేవి రెండు - 'అభివృద్ధి' 'ప్రపంచీకరణ' ఈ రెండింటి పేరిటా మనం మన పర్యావరణాన్ని నాశనం చేసుకుంటున్నాం, అనేక జాతుల ప్రజల్ని నిరంకుశంగా నిరాశ్రయుల్ని చేస్తున్నాం, పరంపరగా మన జీవితాలకు ఆధారాలుగా నిలుస్తున్న వృత్తుల్ని గుంపుగా వదిలి పెడుతున్నాం, బీదా-గొప్ప తారతమ్యాలను పెంచుకుంటూపోతున్నాం. దీన్నించి జరిగిందేంటంటే, మనం ఇలా ఆర్థికాభివృద్ధి వెంట పరుగులెత్తటం వల్ల మన దేశంలో అనేక ప్రాంతాలు అల్లకల్లోలం అయ్యాయి; సంఘర్షణలకు లోనయ్యాయి. ఇంకా అనేక ప్రాంతాలు అగ్నిపర్వతాల మాదిరి లోలోపలే ఉడుకుతున్నాయి. మనదేశంలో పేదరికం తారస్థాయికి చేరుకున్నది; పోషకాహారలేమి చాలా బాధపెడుతున్నది, నిరుద్యోగం సతాయిస్తున్నది; పేదరికం, లేమి - ఇవన్నీ రకాలుగా మనల్ని కృంగదీస్తున్నాయి. అయితే సమాజంలో మనం అలవాటు పడిపోయిన మన ఆర్థిక విధానాలు కావచ్చు, మన విద్య అయితేనేమి, మనం చేసే పరిశోధనలైతేనేమి, మన వ్యాపారాలు, వాణిజ్యాలు, వర్తకం అయితేనేమి, మన వైద్యరంగం అయితేనేమి - అన్నీ ఇదిగో, మన ఈ పరుగునే ప్రోత్సహిస్తూపోతున్నాయి తప్ప, "అందరికీ మేలు" దిశగా తీసుకుపోవట్లేదు.

పరిస్థితులు ఇంత ఘోరంగా ఉన్నప్పటికీ, అనేకమంది, అనేక చోట్ల తమవంతుగా, వేరే వేరే ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు - సాంఘిక, ఆర్థిక సమానత్వం కోసం, పర్యావరణం పరంగా సమతౌల్యత కోసం, మానవ జాతి మొత్తం సుఖంగా మనుగడ సాగించటం కోసం-'వేరే మార్గాలు - ప్రత్యామ్నాయాలు ఏమున్నాయా' అని వెతుకుతూనే ఉన్నారు. ఇలా జరిపే ప్రయత్నాలలో సుస్థిర వ్యవసాయం ఒకటి, సుస్థిర పశుపాలన ఒకటి, అలాగే సుస్థిర చేపల పెంపకం, సుస్థిర అటవీ సంరక్షణ, మన వ్యాపారాలలో ప్రజాస్వామిక న్యాయాలను తేవటం, ఉత్పాదనను శ్రామికుడి నియంత్రణలోకి తేవటం, 'సామాజిక విద్య, సామాజిక ఆరోగ్యం' అన్న భావనలు, భిన్న జాతులు-సంస్కృతుల శాంతియుత సహజీవనం కోసం చేపట్టే చర్యలు, ఇవన్నీ ఈ కృషిలో అంతర్భాగాలు. ఇవేకాక - కొన్ని ఉద్యమాలు వర్గ, కుల, మత, జాతి, లింగ వివక్షలకు వ్యతిరేకంగా సమానత్వం కోసం కృషి సల్పుతున్నాయి. మరికొందరు పట్టణ జీవన విధానాన్ని సుస్థిరం చేసే చేసే అంశాలను, పల్లెల్లో సంపూర్ణ సుస్థిర జీవనానికి గల అవకాశాలను వెతుకుతున్నారు. ఇంకా అనేక విధాలుగా పేదరిక నిర్మూలన కోసం, న్యాయ సమపార్జన కోసం ఎక్కడికక్కడ ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రచారంలో ఉన్న "అభివృద్ధి"కి భిన్నంగా, వేరే దారులను అన్వేషించే ఇలాంటి ప్రత్యామ్నాయ ప్రయత్నాలు పల్లెల్లో - గ్రామీణ స్థాయిలోనూ, పట్టణాల్లో, నగరాల్లోను, జాతీయ స్థాయిలో ప్రణాలికావిధిలోను ఇలా వేరు వేరు స్థాయిలలో జరుగుతూనే ఉన్నాయి. ప్రకృతిని గౌరవించటం, ప్రకృతి విధించే పరిమితులలో జీవించటం - మీద ఆధారపడిన ఇలాంటి ప్రయత్నాలు రానురాను ప్రత్యక్ష ప్రజాస్వామ్యంగా అందరూ నేరుగా ప్రభుతలో పాలుపంచుకొనే విధానాలుగాఎదుగుతున్నాయి. ప్రతినిధుల దయతో పని లేకుండా పౌరులు తమ అభిప్రాయాలను నేరుగా వ్యక్తం చేసి నిర్ణయాలు తీసుకొనే వీలుకల్పించే వేదికల దిశగా సాగుతున్నాయి. ప్రభుత్వంలోకి పారదర్శకత, బాధ్యత వంటి సూత్రాలను బలంగా చొప్పించేందుకు కృషి చేస్తున్నాయి.

ఇలాంటి ప్రత్యామ్నాయ ప్రయత్నాలన్నీ వేటికవి చూస్తే గొప్పగానే అనిపిస్తుంటాయి; కానీ వాటి ప్రభావాన్నీ, వ్యాప్తినీ పరిమితం చేసే అంశాలు చాలానే ఉన్నాయి.

1. వీటి గురించిన డాక్యుమెంటేషన్ (వివరించి చెప్పే రచనలు) బాగా లేదు; అందరికీ వీటి గురించి తెలీదు.
2. ఇవన్నీ చాలా వరకు ఒంటరి పోరాటాలు, ఒకదానితో ఒకటి గట్టిగా ముడిపడి లేవు. విసిరేసినట్లు ఎక్కడికక్కడ పడి ఉంటున్నాయి. తరచు చాలా చిన్న స్థాయిలో ఉంటున్నాయి. ప్రాదేశిక, ప్రభుత్వ విధానాలలో వీటికి అసలు ప్రవేశం లేదు.
3. కొన్ని రంగాలలో చూస్తే వాటికి లోతైన అవగాహన, అనుభవం ఉంటుంది; కానీ మరికొన్ని అంశాలలో అవి బలహీనంగా ఉండచ్చు. ఉదాహరణకు పర్యావరణం మీద చక్కని పనిచేసే సంస్థలో లింగ వివక్ష ఉండవచ్చు; లేదా సామాజిక న్యాయం కోసం పోరాడే చోట పర్యావరణ పట్ల అవగాహన లేకపోవచ్చు; ఇలాగ
4. "ప్రత్యామ్నాయ సమాజం' అంటే ఎట్లా ఉండాలి? " అన్న దృక్పథం ఒకటి వీటన్నింటికీ ఉన్నట్లు, లేదా వీటన్నింటినీ కలుపుకుంటే అలాంటి ఆలోచనా విధానం తయారయ్యేట్లు ఉండదు.

వీటన్నింటి వల్లా జరిగేదేంటంటే, వీటికి పెద్దగా బలం ఉండదు. ప్రాబల్యంలో ఉన్న దృక్పథాన్ని మార్చటం వరకూ ఎందుకు, కనీసం ఎదురొడ్డి సవాలు చేసేంత సత్తా కూడా వీటికి లేదు.

అందుకని, ఈ ప్రత్యామ్నాయ ప్రయత్నాలన్నీ ఒక త్రాటి మీదకు రావాలి.
ఇక్కడొకమాట చెప్పాలి. ఈ మాట ఉందే, 'ప్రత్యామ్నాయం' అనేది - దీన్ని మనం కేవలం సౌలభ్యం కోసం వాడుతున్నాం - ఏమంటే మన ఊహలో ఉన్న దృష్టి కోణాన్ని సంపూర్ణంగా ఆవిష్కరించగలిగే మాట ఏదీ ఎక్కడా లేదు. అంతేకాదు - మనం చెప్పే ఈ ప్రయత్నాలన్నీ యినాటి "అభివృద్ధి" రథానికి నేరుగా అడ్డు నిలువకనూ పోవచ్చు, గొప్ప ప్రత్యామ్నాయాలనూ చూపెట్టలేకపోవచ్చు - కేవలం కొన్ని మౌలిక సూత్రాలపై నిర్మితమైన జీవన విధానాలుగా నిలిచిపోవచ్చు. ఇవన్నీ అసలు క్రొత్తవి కాకపోవచ్చు కూడాను - అనేక తరాలుగా జనజీవన స్రవంతిలో మరుగుపడి నిలిచిన అంశాలు కావచ్చు; లేదా దీనిలో కొన్ని సరికొత్త ప్రయత్నాలూ అయిఉండచ్చు - సమాజంలో నిలద్రొక్కుకునేందుకు తంటాలు పడుతూండచ్చు. ('ప్రత్యామ్నాయం' అంటే ఏంటి? అని వ్రాసిన అనుబంధం చూడండి)

## ప్రత్యామ్నాయ ప్రయత్నాల సమాహారం - "వికల్ప సంగమం"

ఇలా ప్రజల జీవన స్రవంతికి భిన్నంగా, వేరే దార్లు వెతుకుతున్న 'ప్రత్యామ్నాయకారులు' అందరూ తమ తమ ప్రదేశాల వారీగా కలిసి సమావేశమవ్వటం, ఒక త్రాటి మీదకు రావటం బాగుంటుంది. ముందు ఇలా ప్రాంతాల వారీగా కలిస్తే, తర్వాత జాతీయ స్థాయిలోనూ కలవవచ్చు. ఇలాంటి ప్రత్యామ్నాయ ప్రయత్నాల సమాహారాన్నే మనం 'వికల్పసంగమం' అనే పేరుతో పిలుస్తున్నాం. వీరంతా ఒకరి అనుభవాల నుండి మరొకరు నేర్చుకునేందుకు, సంకీర్ణంగా పనిచేసే అవకాశాలను చర్చించుకునేందుకు, ప్రత్యామ్నాయ భవితను కలిసికట్టుగా నిర్మించుకునేందుకు తగిన వేదికలు, ఈ 'వికల్పసంగమాలు'.

ఇలా విభిన్న ఉద్యమాలను, సంఘాలను ఒక త్రాటిమీదికి తెచ్చే వేదికలు అనేకం ఇప్పటికే ఉన్నాయని మాకు తెలుసు. అయితే వీటిలో చాలావరకు ఏదో ఒక్క ఉద్యమానికి / ఏదో ఒకే తరహా పనికి సంబంధించిన నెట్‌వర్క్‌లు (సంకీర్ణాలు) ఉదాహరణకు, 'దుర్మార్గపు అభివృద్ధి' ప్రాజెక్టులకు వ్యతిరేకంగా పోరాడే ఉద్యమాల సమూహాలు కొన్ని; ప్రత్యామ్నాయ వైద్యంపై పనిచేసేవి కొన్ని; సుస్థిర వ్యవసాయంపై పని చేసేవి కొన్ని - ఇలాగ. అయితే ఇలా ఒక తరహా పనుల గురించి కాక, పర్యావరణాన్ని, విద్యను, ఆరోగ్యాన్నీ, న్యాయం, జీవనాధారం, వ్యాపారం, ప్రభుత - ఇలా అనేక రంగాలలో పనిచేసేవారు వీటి ద్వారా తమ అనుభవాలను పంచుకునే వేదికలుగా ఈ వికల్పసంగమాలు నిలవాలని మా ఆకాంక్ష.

ఈ సమావేశాలు అలా విభిన్న రంగాలను కలుపుతాయి; ఇప్పుడు జరిగే ప్రయత్నాలు తదుపరి దశకు వెళ్లేందుకు బాటలు వేస్తాయి; అని మేం భావిస్తున్నాం.

ఈ ప్రయత్నాలన్నీ కలిసి తమకుతాముగా కొన్ని మూల సూత్రాలను ఉత్పాదించుకుంటాయని; వీటికి అన్నింటికీ ఒక ఉమ్మడి అవగాహన ఏర్పడుతుందని; అందరూ ఈ సమావేశాలు సాయపడతాయని మేం అనుకుంటున్నాం. ఇలా ఏర్పడ్డ అవగాహన రానున్న కాలంలో విస్పష్టమైన సైద్ధాంతిక, మౌలిక భావనల నిర్మాణాలుగా తయారై ప్రత్యామ్నాయ రూపాన్ని గట్టి చేస్తాయని మా భావన. అలాగ ఈ సమావేశాలు "చారిత్రక గతిలో విడదీయరాని భాగాలుగా ఉంటాయి తప్ప, ఇవన్నీ ఏవో వేరువేరు సంఘటనలుగా మిగిలిపోవు" అని మేం భావిస్తున్నాం. ఒక్కో సమావేశమూ మరొక వికల్పసంగమానికి దారితీస్తుందని మా విశ్వాసం. జాతీయంగాను, లేదా ఆయా ప్రాంతాలకు సంబంధించిన విధానపరమైన / ఇతరత్రా మార్పులు 'ఎలా ఉండాలి' అన్నదానిపైన, 'రాజకీయ పర్యావరణం ఎలా ఉండాలి?' అన్నదానిపైన స్పష్టమైన నిర్ణయాత్మక వైఖరి రూపొందేందుకు ఈ వికల్పసంగమాలు వేదికలు కావచ్చు.

పై అంశం గురించి ఇంకొంత స్పష్టత రావాల్సి ఉన్నది. 'కోర్‌గ్రూప్' (క్రింద చూడండి) వారు కలిసి సమావేశల కోసం ప్రణాలికలు తయారు చేసే క్రమంలో ఇది కూడా స్పష్టం కావచ్చు.

## వికల్ప సంగమాలు జరిగే పద్ధతి

ఏదో వైజ్ఞానిక కాన్ఫెరెన్సులో పత్రాలు చదివి పనయిపోయిందనుకున్నట్లు కాక, ఈ వికల్పసంగమాలలో మనసులు, హృదయాలు, భావనల్ని స్వేచ్ఛగా ఇచ్చిపుచ్చుకునేందుకు తగిన వాతావరణం ఉంటుంది. ప్రత్యేక అంశాలపై కేంద్రీకరింపబడిన కొన్ని గ్రూప్ సెషన్లుంటాయి. వీటిలో లోతుగా చర్చించేందుకు, ఆలోచనల్ని ఒకరితో ఒకరు పంచుకునేందుకు వీలవుతుంది. సమావేశంలో కనీసం సగం సమయం ఒకరి పని గురించి మరొకరు ఒక ఉద్యమం గురించి మరో ఉద్యమకారులు తెలుసుకునేందుకు కేటాయించబడుతుంది. ఈ ప్రయత్నాలను అందరికీ తెలియపరచేందుకుగాను ప్రదర్శనలు, సినిమాలు / డాక్యుమెంటరీలు, నాటకాలు ఇంకా ఇతర కళారూపాలు, లేదా వివిధ రకాల ఆహార పదార్థాలను, ఉత్పాదనలను పంచుకోవటం ఇవన్నీ ఉంటాయి. ఈ సంగమాలలో ఉత్సాహానికి, నేర్చుకునేందుకు, స్నేహ బంధాలు బలపరచుకునేందుకు అవకాశం ఉండాలి. స్థానికంగా ఆతిథ్యం ఇచ్చే సంస్థలు, నిర్వాహకుల నిర్ణయాలననుసరించి ఈ సంగమాలు విభిన్న ఆకృతులను సంతరించుకోవచ్చు.

'ప్రస్తుత సమాజపు లోటుపాట్లను ఎత్తి చూపటానికి చాలా కొద్ది సమయాన్ని మాత్రమే వెచ్చించాలి' అని మా అభిప్రాయం. ఈ పని చేసేందుకు ఇప్పటికే చాలా సందర్భాలున్నాయి. మన ఈ వికల్ప సంగమాలలో ప్రత్యామ్నాయ ఆలోచనలు, కార్యక్రమాలపై దృష్టి సారిద్దాం. అయితే ఈ క్రమంలో ప్రత్యామ్నాయాలను పొగిడి, అద్భుతంగా కీర్తించి వాటిని ఊహల పల్లకీలుగా చేయడం మా ఉద్దేశం కాదు. వాటి లోటుపాట్లనన్నింటినీ కూడా సావధానంగా చర్చిద్దాం.

## పాల్గొనేవారు, సమావేశ స్థలాలు

రకరకాల సామాజిక అంశాలను అధ్యయనం చేస్తున్నవారు; పరిశోధకులు; ఆచరణలో చేసి చూపెడుతున్నవారు; ఉద్యమకారులు; అభివృద్ధి సమంగా లేకపోవడం గురించి, దౌర్జన్యంగా ఉండటం గురించి లోతుగా అధ్యయనం చేసిన సైద్ధాంతికులు - ఇలా రకరకాల వారిని ఈ సమావేశాలు ఒక్క వేదిక మీదికి తెస్తాయని మా నమ్మకం. ప్రాంతీయ పరిస్థితులను అనుసరించి వీటిలో పదిహేను మంది నుండి కొన్ని వందల మంది వరకు పాల్గొనవచ్చు.

ప్రతి వికల్పసంగమానికీ ఒకటి (లేదా చాలా) స్థానిక సంస్థలు ఆతిథ్యం ఇచ్చి నిర్వహిస్తాయి. ఆ సంస్థకు దీనికి తగిన సామర్థ్యం ఉండి ఉండాలి. దీనికయ్యే ఖర్చుల్ని ఈ సంస్థ, దానితోపాటు కలిసి పనిచేస్తున్న ఇతర నిర్వాహక సంస్థలు ఇంకా వీటిలో పాల్గొనేవారు భరించాలి. ఇలాంటి సమావేశాలకు అయ్యే ఖర్చును పూర్తిగా విరాళంగా సేకరించటం ఎవరికీ సాధ్యం కాకపోవచ్చు, అందువల్ల ఈ ఖర్చును విస్తృతంగా పంచితే ఏ ఒక్కరి మీదా భారం పడదు.

### ప్రత్యామ్నాయ సమాగమాల నిర్వాహఖ నిర్మాణం (కోర్ గ్రూప్)

Kalpavriksh, Decan Development Society, Bhoomi College, Shikshantar, Timbaktu Collective, Development Alternatives, SOPPECOM, Gene Campaign, Bhasha, Kriti Team, Centre for Equity Studies, URMUL, Maati Sangathan, Peoples' Science Institute, National Alliance of Peoples' Movements మరియు Sushma Iyengar లతో ఈ బృందం తయారయింది. ఇంకా చాలామంది ఈ బృందంలో చేరనున్నారు.

వికల్ప సంగమాల మొదటి దశకు కేంద్ర స్థానంలో ఉండి నిర్వహించే బాధ్యతను 'Kalpavriksh' తీసుకున్నది.

ప్రతి సంగమం క్షేత్రంలోను స్థానికంగా ఆతిథ్యం ఇచ్చే సంస్థ ఒకటి ఉంటుంది. లేదా దీనిస్థానంలో అనేక సంస్థలు, వ్యక్తులతో కూడిన నిర్వాహక బృందం ఒకటి ఉండచ్చు కూడా. సమావేశాన్ని నిర్వహించటంలో కోర్‌గ్రూప్ వారు వీరికి సహాయం చేస్తుంటారు.

### మొదటి సంగమం, 17-19, అక్టోబర్ 2014

ఇలాంటి మొదటి సమావేశం టింబక్టు, ఆంధ్రప్రదేశ్‌లో అక్టోబర్ 17 నుండి 19 తేదిల్లో జరగనున్నది. ఈ కార్యక్రమానికి Timbaktu Collective మరియు Kalpavriksh సంస్థలతో పాటు Centre for Sustainable Agriculture - Secunderabad, Laya Resource Centre - Visakhapatnam, ACCORD & Just Change - Gudaluru, Accion Fraterna - Anantapur, Dastkar Andhra - Hyderabad, Deccan Development Society - Zaheerabad, WASSAN - Secunderabad, Centre for Learning - Hyderabad మరియు Uzramma - Hyderabad సహనిర్వాహకులుగా వ్యవరిస్తారు.

**సంప్రదించండి:**

**Timbaktu Collective**

**బబ్లూ గంగూలీ** bablu@timbaktu.org - +91 9440686837 / **మేరి వట్టమట్టమ్** mary@timbaktu.org - +91 9441417444

**Kalpavriksh**

**శిబా డేసోర్** desor.shiba@gmail.com - +91 8237216954 / **ఆశిష్ కొఠారి** chikikothari@gmail.com

**అనుబంధం :**

## ఏవి 'ప్రత్యామ్నాయాలు?

1. భౌతికంగా చేపట్టిన పనులు, కార్యకలాపాలు, విధానపరమైన నిర్ణయాలు, మార్పులు, క్రొత్త సాంకేతికతలు, కొత్త ఆలోచనా విధానాలు, నూతన భావనలు - ఇవన్నీ ప్రత్యామ్నాయాల పరిధిలోకి రావచ్చు.
2. ఈ ప్రత్యామ్నాయాలను వేరు వేరు స్థాయిలలో వ్యక్తులు, సమూహాలు ప్రతిపాదించవచ్చు. ప్రచారం చేస్తూండవచ్చు, ఆచరణలో చూపించవచ్చు.
3. ప్రత్యామ్నాయాలన్నింటికీ మూలస్తంభాలుగా నిలిచే భావనలు రెండు : ఎ) పర్యావరణపరంగా సుస్థిరత్వం, బి) సామాజిక, ఆర్థిక సమానత్వం. ఇవి రెండూ తప్ప అవి ప్రత్యామ్నాయాలు కాజాలవు. ఇలా చూస్తే క్రింది విషయాలు తెలిసివస్తాయి:

ఎ) పర్యావరణ సుస్థిరతలో మూడు అంశాలున్నాయి:

1) పర్యావరణాన్ని, మార్పును తట్టుకోవటంలో  దానికున్న శక్తిని సంరక్షించటం
2) పర్యావరణం నాశనమైన చోట్ల, దాన్ని పునరుద్ధరించటం,
3) సుస్థిర మార్గాలలో ఉత్పాదకతను పెంచే ప్రయత్నం చెయ్యటం

బి) సామాజిక న్యాయం, సామాజిక పరిపూర్ణత్వం

- భౌతికంగాను, సామాజికంగాను, సాంస్కృతికంగాను, ఆధ్యాత్మికంగాను తృప్తినిచ్చే జీవితాలు
- పేదరికం, ఇంకా ఇతర రకాల లేమి-దారిద్ర్యం-పూర్తిగా తుడిచిపెట్టుకుపోయి ఉండాలి.
- సామాజిక, ఆర్థిక, రాజకీయ లబ్దిలో సమానత్వం ఉండాలి; లాభాలు, హక్కులు, బాధ్యతలు అన్నింటా సమానత్వం ఉండాలి.

సి) ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం కాకుండా, నేరుగా వ్యక్తి ఆధారిత ప్రజాస్వామ్యం

- అతి చిన్న గ్రామం-పల్లె-వాడలో నిర్ణాయక హక్కు మొదలవుతుంది.
- ప్రతి వ్యక్తికీ ఇందులో పాల్గొనే అవకాశం, హక్కు, సామర్థ్యం కల్పించబడుతుంది.
- ఈ స్థాయి నుండి పై స్థాయిలకు, చివరికి ప్రభుత్వానికి నిర్ణాయకహక్కు సంక్రమిస్తుంది.
- అన్ని స్థాయిలూ క్రింది స్థాయిలలోని ప్రజాస్వామిక సంస్థలకు జవాబుదారులౌతారు.

డి) ఆర్థిక ప్రజాస్వామ్యం

- స్థానిక ప్రజా సమూహాలకు ఉత్పత్తి సాధనాల మీద హక్కు ఉంటుంది.
- వాటి పంపిణీ మీద, పంపకాల మీద, మార్కెట్ల మీద స్థానిక సమూహాలకు మొదటి హక్కు.
- ఈ క్రమంలో స్థానిక నిర్ణయాలు ప్రధానం, ఇతర వ్యాపారం-అంతా దాని తర్వాతే వస్తాయి.

4) పై నాలుగింటిలో ఏ రెండింటిని స్పృశించినా, ఆ కృషిని 'ప్రత్యామ్నాయం'గా పరిగణించవచ్చు; అయితే అది మిగిలిన రెండింటినీ కనీసం స్పృశించేందుకు వీలుగా ఉండాలి. దీని ప్రకారం, ఏదైనా ఒక ఉత్పాదక సంస్థ ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని సాధించిందనుకోండి, అయితే దాని పర్యావరణం పరంగా సుస్థిర మార్గం కాదనుకోండి, తనకు వచ్చిన లాభాలను సమానంగా పంచనిది అనుకోండి, - ఇక అది 'ప్రత్యామ్నాయం' అనిపించుకోదు. అలాగే విద్యుత్ వినియోగాన్ని తగ్గించే అద్భుత సాంకేతికత ఒకటి ఉన్నదనుకోండి, అయితే అది కేవలం ధనవంతులకే పరిమితం, పేదవారికి ఇక ఎన్నటికీ అందుబాటులోకి రాదు - ఇక అది 'ప్రత్యామ్నాయం' కాజాలదు.

**గమనిక :** పైన ఇచ్చిన వివరణ ఏమంత స్పష్టమైనది కాదు, లోతుగా లేదు, దీన్ని అన్ని పరిస్థితులకూ వర్తింపజేయడం కష్టం. అయితే ఏదైనా కృషిని చూసినప్పుడు దానిలోని మంచి అంశాల ఆధారంగా మనకు మనసులో భావన - దాన్ని ప్రత్యామ్నాయానికి ఆధారంగా తీసుకోవచ్చు. దానిలోటుపాట్ల గురించి తదుపరి చర్చల్లో ఎలాగూ తేల్చుకోవచ్చు కద!